# రేవతి నుంచి దూరదృష్టి

సీతా!

చక్కటి జాబు వ్రాయటానికి అవకాశమిచ్చే నీ వుత్తరం అందింది. నువ్వు వ్రాసిన 'దురదృష్ట బాలిక' గురించి చెపుతున్నాను.

ఆ అమ్మాయి సారె గదిలో ఏమో అల్లరి చేసిందనీ, ఆ భర్తతో కాపురం చెయ్యదేమోనని కూడా భయంగా వుందనీ చివర వ్రాశావు. నీకా భయం అక్కరలేదు. ఆమె త్వరలోనే పొరబాటు సర్దుకుంటుంది. అదికాక, ఆమెకే మాత్రమేనా లోకజ్ఞానమే వుండి వుంటే యీ పొరబాటయినా జరిగి వుండదు.

యీ సందర్భంలో ఆ అమ్మాయి స్థితిలో నేనే వుండి వుంటే ఆ సంబంధాన్ని తిరస్కరించి వుండను. తాను తిని యితరులకు పెట్టడానికి డబ్బుందంటున్నావు– కుటుంబం మర్యాదైనదనీ వారంతా కలివిడిగా వుండేరకమనీ చెపుతున్నావు – కుర్రవాడు వేషం పల్లెటూరిదైనా చాలా చక్కనివాడనీ పరిపూర్ణమయిన దేహసౌష్టవం అనీ చెపుతున్నావు – ఇంగ్లీషు చదువుకోలేదు కాని తెలుగులో కవిత్వం కూడా వ్రాస్తాడని విన్నట్టు జ్ఞాపకమనీ చెపుతున్నావు – యింకేం కావాలి?

ఇందులో నువ్వుగాని లేక ఆ అమ్మాయిగాని చూపేవల్లా రెండే లోపాలు. ఒకటి పల్లెటూరు, రెండు యింగ్లీషు చదువుకొనకపోవడం.

యీనాడు వాళ్ళ అన్న తలెత్తాక పట్నం వచ్చింది కాని, అంతకు ముందు యెక్కడుండేది ఆమె? అయితే యీ నడిమంత్రపు పట్టణ నివాస భాగ్యం ఆమెను భ్రమింపజేసి వుండవచ్చు. కాని జీవితంలో పడ్డాక కుటుంబ భారం తలపై పడితే యే మనిషైనా పల్లెటూరికిచ్చే ప్రాధాన్యత పట్నంకు యివ్వరు. అదికాక యిల్లువీడి బయటకు రావడానికి భయపడే ఆంధ్ర అబల ఉండేది పల్లెటూరు అయితే యేం, పట్నం అయితేయేం?

యింక రెండవది–

యిక్కడే మనవారు పెద్ద పెద్దలు కూడా చాలా పొరబడుతుంటారు.

చదువుకు ప్రయోజనం యేమిటి? సంస్కృతి, జీవిత ధన సంపాదన – యీ రెండే కదా? యిందులో రెండవది అతనికి అవసరం లేదు. పోతే సంస్కృతి వుంది.

మన పాఠశాలలు కాని, కళాశాలలు కాని, కొద్ది శాస్త్రాన్నీ, భాషనూ తప్ప ఇంకేమీ బోధించటం లేదనేది తథ్యం. మరి యింగ్లీషు 'భాష' నేర్చుకోవటం వల్లనే సంస్కృతి వస్తుందంటావా?

మనిషిలో సంస్కృతి ఒక భాష నేర్చుకోవటం వల్ల యెన్నడూ కలుగదు. భాషలోని ఉద్గ్రంథాలు చదివి పాఠం అర్థం చేసుకోవటం వల్ల కలుగు తుంది. ప్రతి భాషలోనూ సంస్కృతినిచ్చే గ్రంథాలు చాలా ఉంటాయి. అవి చదివి గ్రహిస్తే చాలు.

నువ్వు వ్రాసిన అంశాలనుబట్టే చూడు. చదువుకున్న వారనీ, నాగరికులనీ పిలువబడే నేటి పట్టభద్రులు కూడా – హైన్యంగా కట్నం లేందే దిగిరాని యీ రోజుల్లో – వరకట్నాలకు వ్యతిరేకినంటూ యివ్వనున్న కట్నాన్ని తిరస్కరించాడంటే అందులో అతని నాగరికతా, సంస్కృతీ అగపడటం లేదా? నువ్వు వ్రాసిన ఆ పునః సంధానపునాటి రాత్రి కథలో యీమె అబద్ధపు ఆటంకాన్ని సగౌరవంగా అంగీకరించటంలో అతని సంస్కృతి అగపడటం లేదా?

బహుశా మీరు అతనిని యింకొక విధంగా అర్థం చేసుకొని వుంటారు – తన లోని Inferiority Complex అలా చేయించింది అనుకుని వుంటారు.

కాని అతని గ్రామంలో అతని పరిసరాల మధ్య అతనికున్న స్థానాన్నీ, గౌరవాన్నీ చూచినప్పుడు, అతనితో కొన్నాళ్ళు గడిపినప్పుడు మీ సఖికి తెలియవస్తుంది – తనకు లభ్యమైనది రాయి కాదనీ, అనన్య లభ్యమైన వజ్రమనీ.

అప్పుడు – ఆమె తిరిగి వచ్చాక నువ్వు పోయి అడుగు. – సిగ్గుతో యర్రనైన ముఖం వంచి ఆనంద జనితోద్వేగంకు యెగిరే గుండెల్లోంచి "వారు.. వారు..." అంటూ యేమేమి చెబుతుందో విను.

– నీ రేవతి ★

*(చిత్రాంగి: అక్టోబరు 1946)*